ప్రజాశక్తి
మంగళవారం 20 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అందరూ యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 21న ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆ ప్రకటన లో తెలిపారు. మానసిక, శారీరక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ ఐటిడిఎ వద్ద రాత్రి బస

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన విద్యారంగం, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలభిస్తున్నారని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. గిరిజన విద్యారంగం, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఐటిడిఎ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన విద్యార్థులు ఎక్కువ మంది డ్రాపౌట్లుగా మారారని, ఇందుకు ఖాళీలను భర్తీ చేయకపోవడం, సవర భాషా వాలంటీర్లను నియమించకపోవడమేనని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని పిజి హెచ్‌ఎంల ప్రమోషన్లు భర్తీ చేయడం లేదని, దీనిపై అధికారులకు అనేక సార్లు విన్నవించనా స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర వర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ 10 నెలలుగా మెస్ బిల్లులు చెల్లించలేదని, దీనివల్ల వార్డెన్లు అప్పుల పాలయ్యారన్నారు. గిరిజన విద్యార్థులకు సరైన పౌష్టిక ఆహారం అందడం లేదన్నారు. పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఎఎన్‌ఎంలను మించాలని, కుక్ లు, కమాటీలను నియమించాలని ఐటిడిఎ కన్వీనర్ ఎ.కృపానందం డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి. జ్యోతి మాట్లాడతూ సిఆర్‌టిలను అందర్నీ రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోతే ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాత్రి 7.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్కడే భోజనాలు చేసి, నిద్ర అనంతరం మంగళవారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల, భాషా వాలంటీర్లు, సిఆర్‌టిలు పాల్గొన్నారు.

శిబిరాన్నిఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్

బసలో నిద్రిస్తున్నఉపాధ్యాయులు, సిఆర్‌టిలు, వాలంటీర్లు

సిఎం సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కురుపాం నియోజకవర్గంలో ఈనెల 28న పర్యటించనున్న సందర్భంగా నియోజకవర్గ కేంద్రానికి సమీపానున్న చినమేరంగికి వెళ్లే సమీపాన గల మోన్ఫోర్ట్ పాఠశాల దగ్గర ఉన్న మైదానాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ఏర్పాటుకు, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పి జివి కృష్ణారావు, స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఆర్‌అండ్‌బి ఎఇ నిర్మలాకుమారి, ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభా స్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, అధికారులు

22న యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో యువజనోత్సవాలను ఈనెల 22న నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, ఎస్.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన స్థానిక ఎస్‌వి డిగ్రీ కళాశాలలో భారత దేశం 2047 అనే థీమ్ తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నామని తెలిపారు. విజేతలకు బహుమతి, జాతీయ స్థాయి వరకు యువ ఉత్సవ్ లో వెళ్లే అవకాశం ఉందని అన్నారు. యువ ఉత్సవ్ పోటీల్లో పాల్గొనదల్చిన 15 నుండి 29 వయస్సులోపు ఉన్న యువ ఔత్సాహికులు వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు పార్వతీపురం మన్యం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో లేక 7386325310 ఫోన్ కు సంప్రదించాలని ఆయన కోరారు.

ఫిర్యాదుదారులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి వినతులివ్వడానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావులతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 98 అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులంతా పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి :ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు , కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి కార్యక్రమంలో 7 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఎస్ఐ దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు 70 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 70 వినతులు వచ్చాయి. ఐటిడిఎలో సోమవారం పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన వినతుల్లో కొన్ని.... మనుమకొండకు చెందిన బి.రేఖ సిఆర్‌టి పోస్టు ఇప్పించాలని విన్నవించారు. రింపికి చెందిన చందర్రావు ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని, భామినికి చెందిన భారతి హెల్త్ వర్కర్ పోస్టు ఇప్పించాలని కోరారు. అడ్డంగి గ్రామానికి చెందిన ప్రసాద్ రోడ్డు మరమ్మతులు చేయించాలని, కరియపల్లి చెందిన నర్సింగరావు పవర్ ట్రిల్లర్, సంకిలికి చెందిన మహేష్ బోరు మంజూరు చేయాలని కోరారు. ఇసుకగూడ చెందిన భీమేష్ మేకల్లోను ఇప్పించాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ సింహాచలం, డిడి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, సిడిపిఒ రంగలక్ష్మి, ఎపిడిలు శ్రీహరి, రమణ, జిసిసి డిఎం సంధ్యారాణి, ఎటిడబ్ల్యుఒ మంగ వేణి తదితరులు పాల్గొన్నారు

దోచుకుంటున్నారు

- పట్టుకున్నారు....వదిలేశారు
- మట్టి మాఫియాపై నిఘా ఏది..?

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

కొద్దిరోజులుగా పాలకొండలో సహజ సంపదను కొంతమంది దర్జాగా దోచుకుంటున్నారు. కొండలు, కోనలు, చెరువులు, గుట్టలు తేడా లేకుండా తవ్వుకు పోతున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి దోచుకోవడంలో కొద్దిరోజుల నుంచి అడ్డుఅదుపు లేకుండా పోతుంది. కొంత మంది వ్యక్తులు ఇదే వ్యాపారంగా చేసుకుని రోజుకు వందలాది ట్రాక్టర్లతో మట్టిని పెరుగుతున్నారు. ఎక్కడ ఎటువంటి నిర్మాణాలు జరుగుతున్నా మట్టి వేయడానికి అగ్రిమెంట్ తీసుకుని దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. దీంతో ప్రజలు నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇరిగేషన్ చెరువుల్లో కూడా దర్జాగా మట్టిని తవ్వుకుంటూ వ్యాపారాలు చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.1000 వరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. చెరువుల్లో జెసిబిలు పెట్టి ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నారు. తంపటాపల్లి, వెలగవాడతో పాటు జగన్నాధస్వామి ఆలయ వద్ద ఉన్న చెరువుల్లో దర్జాగా మట్టి తవ్వుకుని రవాణా చేస్తున్నారు. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది.

పట్టుకున్నారు....వదిలేశారు....

పట్టణంలో ఇటీవలే ఎన్.కె.రాజపురం రోడ్డులో ఒక ఇరిగేషన్ చెరువు దగ్గర సుమారు 50 ట్రాక్టర్లు మట్టిని జెసిబి తవ్వుతుండగా ఇరిగేషన్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి తహశీల్దార్‌కు అప్పగిస్తామని బహిరంగంగా ప్రకటించారు. అయితే ఒక్క ట్రాక్టర్‌ను కూడా సీజ్ చేసిన దాఖలాల్లేవు. ఉదయం పట్టుకున్న వాహనాలు గంటలోనే వదిలేశారు. దీనిపై పలు విమర్శలు వినిపించాయి. ఇరిగేషన్ అధికారులు ఎందుకు వెనక్కు తగ్గారన్న అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయి. అదే కాకుండా ఏకంగా చెరువులు తవ్వుకోవడానికి అనుమతులే ఇస్తామని ఇరిగేషన్ అధికారులు చెప్పడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పట్టుకున్న అధికారులే వెనక్కు తగ్గి మరలా అనుమతులు ఇవ్వడానికి కారణమేమిటని చర్చ జరుగుతుంది.

చెరువులో మట్టిని తవ్వుతున్న జెసిబి (ఫైల్‌ఫోటో)

పట్టపగలే రవాణా....

మట్టిని రోజుకు వందలాది ట్రాక్టర్లతో పట్టపగలే రవాణా చేస్తున్నారు. ఎక్కడ నిర్మాణాలు జరిగితే అక్కడకు దర్జాగా రవాణా జరుగుతుంది. జెసిబిలు పెట్టి హడావుడి చేసి రవాణా చేస్తున్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. ముఖ్యంగా ఎన్.కె.రాజపురంకు చెందిన ఒక వ్యక్తి రెండు జెసిబిలతో యథేచ్ఛగా మట్టిని రవాణా చేస్తున్నా అడిగే నాధుడే లేకుండా పోయారు. మైన్స్ అధికారులు కూడా దీనిపై చూసీచూడనినట్టు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీన్ని అడ్డుకట్ట వేయకపోతే చెరువుల రూపురేఖలు మారిపోయే పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రూ.15.45 లక్షల స్టాక్ సీజ్ • ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కలెక్టరేట్

పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.15.45లక్షల స్టాక్‌ను సీజ్ చేశారు. ఇటీవల ప్రజాశక్తిలో ప్రచురితమైన 'మొద్దునిద్రలో వ్యవసాయశాఖ' అన్న కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో సాలూరు, కురుపాం వ్యవసాయశాఖ ఎడిలు రెండు బృందాలు ఏర్పడి పార్వతీపురం పట్టణంలో ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి ట్రేడర్స్, కార్తికేయ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, స్కందమార్ట్‌ల్లో రూ.15.45 లక్షల స్టాక్‌ను సీజ్ చేశారు. స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు చేపట్టడం, ధరల పట్టికను ప్రదర్శించకపోవడం, అధీకృత తయారీదారుల నుంచి కొనుగోలు చేసిన ఇన్వాయిస్, సోర్స్ సర్టిఫికెట్లు నివేదించలేక పోవటం తదితర విషయాలు గుర్తించారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, పురుగు మందుల నిల్వలను సీజ్ చేశారు. సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు.

విద్యాసంస్థల్లో టూరిజం క్లబ్‌లు

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యా సంస్థల్లో టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయనున్నట్టు పర్యాటక శాఖ అధికారి ఎన్. నారాయణరావు తెలిపారు. సోమ వారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రిన్సిపళ్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పర్యాటకానికి యువశక్తి, ఆసక్తి, అభిరుచి పెంపొందించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని వివరించారు. విద్యాసంస్థలో టూరిజం క్లబ్బుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాధికా అమత్ మహోత్సవంలో భాగంగా టూరిజం క్లబ్బుల ద్వారా విభిన్న సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. టూరిజం క్లబ్బుల ద్వారా విద్యార్థులకు దేశ, రాష్ట్ర, జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలపై విశ్లేషణాత్మక చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. టూరిజం క్లబ్‌లో పాల్గొనడం వల్ల టీం వర్క్, మేనేజ్మెంట్, లీడర్ షిప్ వంటివాటిపై నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ క్లబ్బుల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు గైడులుగా, వాలంటీర్లుగా అవకాశం కల్పించనున్నామని ఆయన వివరించారు. దేశంలో విభిన్న సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాల గురించి యువతకు అవగాహన కల్పించడమే టూరిజం క్లబ్బుల ప్రధాన లక్ష్యమన్నారు. విద్యతో పాటు పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత, ప్రయాణాల గురించి వివరిస్తామని, తొలి దశలోనే పర్యాటక అవకాశాల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పర్యాటక పద్ధతుల బోధన, విద్యార్థులకు నైపుణ్యం, హాస్పిటాలిటీ శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధికి అవకాశాలు కలుగుతాయని వివరించారు. స్టడీ టూర్స్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాల కోసం మెరుగైన సమన్వయాన్ని సులభతరం చేయడం ద్వారా పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి అవకాశం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలపతి రావు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కె.వెంకట ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతన బకాయిలు చెల్లించాలి

ఖాళీ ప్లేట్లతో గ్రీన్ అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

వేతన బకాయిలు చెల్లించాలని, మా ఆకలి తీర్చండంటూ ఖాళీ ప్లేటుతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, గ్రీన్ అంబాసిడర్ పాలకొండ మండలం కమిటీ గౌరవ అధ్యక్షులు కాద రాము మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు సౌకర్యం కల్పించాలని, జిఒ 680 ప్రకారం వేతనం చెల్లించాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేలు వేతన బకాయిలు ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఒక్కొక్క పంచాయతీకి ఒక రకంగా బకాయిలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా పంచాయతీలపై భారం మోపిందని, కొన్ని పంచాయతీల్లో సర్పంచులు వేతనాలు చెల్లించలేం, విధులు నుండి తొలగిపోమని చెబుతున్నారని, రాజకీయ వేధింపులు ఆపాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండల వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో టి.శంకరరావు, కూర్మారావు, రవి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఎంపి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూప్ (ఆంగ్ల మాధ్యమం)ల్లో ప్రవేశాలకు ఎంపిక జాబితాను కళాశాల నోటీస్ బోర్డులో ఉంచామని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 21లోపు తమ టెన్త్ మార్కుల జాబితా, కుల, నివాస ధ్రువీకరణ, రేషన్ కార్డ్, ఆధార్ కార్డులు, (తల్లి, తండ్రి, విద్యార్థి), 5 ఫోటోలు, టిసి, స్టడీ సర్టిఫికేట్, తల్లి బ్యాంక్ పాస్ బుక్ కాపీలన్నీ మూడు సెట్లు జిరాక్స్ తీసుకుని రావాలన్నారు. లేనిచో సీటు వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి కేటాయిస్తామని స్పష్టం చేశారు.

పులి సంచారంపై పట్టణ ప్రజల్లో భయాందోళనలు

ప్రజాశక్తి - సాలూరు

కొద్దిరోజుల క్రితం గుమడాం సమీపంలో ఉన్న పామాయిల్ తోటలో ఆవుపై దాడి చేసి చంపేసిన పులి సంచారంపై ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం పట్టణానికి సమీపంలో ఉన్న లారీ యూనియన్ కార్యాలయం ఎదురుగా ఉన్న పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని స్థానికులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు పొలాల్లో పాదముద్రలు పరిశీలించగా అవి పులి పాదముద్రలు కావని నిర్ధారణ చేశారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల క్రితం మక్కువ మండలంలో పులి పాదముద్రలు గుర్తించారు. పులి గమనం ఎటువైపు వుంటుందో తెలియని అయోమయంలో అటవీశాఖ అధికారులు వున్నారు. అదిగో పులి ఇదిగో తోక అన్నట్టు నియోజకవర్గ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నాయకులు యు.లక్ష్మి అధ్యక్షతన మధ్యాహ్నం భోజన కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన కార్మికులను విధుల్లో చేర్చుకోవాలని, డిమాండ్ చేశారు. 20 ఏళ్ల నుంచి పిల్లలకు వండి పెడుతున్న కార్మికులను ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, కాటన్ చీరలు, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పాలని చూడడం కార్మికుల కడుపు కొట్టడమేనని ఆందోలన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా ఒక్కొక్క కార్మికురాలికి రూ.10వేలు వేతనం, పాఠశాలల్లో వంట పాత్రలు, సబ్సిడీ వంట గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు భవాని, లక్ష్మి, సీతమ్మ, సరోజిని, అప్పలనరసమ్మ, పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి శాంతికుమారి

ప్రజాశక్తి
www.prajasakti.com

గోపాలరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బేబినాయన

గోపాలరావు కుటుంబాన్ని పరామర్శించిన బేబీనాయన

ప్రజాశక్తి-సీతానగరం

ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపకులు గోపాలరావు అనారోగ్యంతో ఆదివారం మరణించారు. ఆయన కుటుంబాన్ని బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బేబీనాయనా సోమవారం పరామర్శించి గోపాలరావు పటానికి పూలదండ వేసి నివాళులర్పించారు అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు సవరపు జయమణి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, రామవరం సర్పంచ్ పెంట సత్యనారాయణతో పాటు వైసిపి నాయకులు ఎస్.రామారావు, ఎం.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒగా ఆనందరావు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల విద్యాశాఖ అధికారి-2గా ఆర్.ఆనందరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పాలకొండ మండలం ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ అందరూ సహకరిస్తే విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సీతానగరం : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మొదటి ఎంఇఒగా జి.సూర్య దేముడు, రెండో ఎంఇఒగా మువ్వల వెంకటరమణ సోమవారం విధుల్లో చేరారు. వీరికి ఉపాధ్యాయ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న డిసిసి అధ్యక్షులు సింహాచలం, నాయకులు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఎఐసిసి ప్రధానకార్యదర్శి రాహుల్‌గాంధీ 53వ జన్మదిన వేడుకలు సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం, కాంగ్రెస్‌ను గెలిపిద్దామంటూ కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. స్టీల్ ప్లాంట్, రైల్వే జోను, ఎస్‌బిఐ, ఎల్ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు సర్పంచ్ నిమ్మక కళావతి, కాంగ్రెస్ నాయకులు ఎం.లక్ష్మయ్య, కె.ష్ణారావు, పకీరు, కిషోర్, రాఘవేంద్ర, చరణ్ ఉన్నారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగ మన్మధరావు, డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గిరిజనులతో కలిసి పిఒకు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం తోలుఖర్జ, పెద్దఖర్జ మంగళాపురం, ఆమెటి, బొడ్డుడి మానుగూడా, తదితర గ్రామాల్లో గిరిజనులకు ఇళ్ల స్థలాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుమ్మలక్ష్మీపురం రెసిడెన్షియల్ స్కూల్ పక్కన ఉన్న భూమిలో గిరిజనులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి టి.జీవ, కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కోరంగి గోపి నాయుడు, బి.బంగారి, పువ్వుల ప్రసాదు, పి.మోహనరావు, సింగన్న, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

నేల స్వభావం అనుసరించి పంటలు వేసుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయంలో రైతులు నేల స్వభావం అనుసరించి పంటలు పండించుకోవాలని ఎపిఎన్‌సిఎఫ్, జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్.షణ్ముఖరాజు అన్నారు. సోమవారం పెద్ద బొండపల్లిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సిబ్బంది, రైతులకు పలు సూచనలు చేశారు. పొలంబడి కార్యక్రమంలో నేర్చుకోవాల్సిన అంశాలను, వాతావరణ, నేల స్వభావం గురించి, ప్రధాన పంటల్లో వచ్చే చీడ పీడలు, పురుగులు తెగుళ్లను గుర్తించి రైతు తనంతట తాను తన పొలంలో వచ్చే తెగుళ్లను గుర్తించి తనకు తానుగా నివారణ చేసుకొనేలా రైతులు ఎదగాలని అన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రకృతి వ్యవవసాయంపై అనుకూల, ప్రతికూల అంశాలపై చర్చించారు. ప్రతి రైతు తమ పంటలకు సోకే తెగుళ్లపై అవగాహన ఉండాలన్నారు. అలాగే 365 పద్ధతిలో పాటిస్తున్న రైతు పొలం గమనించి పిఎండిఎస్ సాగు విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాస్టర్‌ట్రైనీ వై.శ్రీరాములు, ఎస్‌డిపి రమణమ్మ, ఐసిఆర్‌పిలు తేలు శంకరరావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బస్సుయాత్రకు రథసారథిగా వెంకట నాయుడు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 51 మంది నాయకులతో చేపట్టబోయే ఉత్తరాంధ్ర బస్సుయాత్రకు అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడును నియమించారు. ఈ మేరకు సోమవారం టిడిపి కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి.

రోగులను పరామర్శించిన భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చికిత్స పొందుతున్న రోగులను టిడిపి నాయకులు పడాల భూదేవి సోమవారం పరామర్శించారు. భామిని మండలం తాలాడ కు చెందిన టిడిపి నాయకులు వలురౌతు పాపినాయుడు కుమార్తె శస్త్రచికిత్స చేయించుకోగా వారిని పరామర్శించారు. సీతంపేట మండలం లోని పలువురు ను పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు

కుడ్డపల్లిలో పల్లెబాట

ప్రజాశక్తి - సీతంపేట

జనసేన ఆధ్వర్యంలో సోమవారం కుడ్డపల్లిలో పల్లెబాట కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు ప్రజలకు తమ పార్టీ సిద్ధాంతాల్ని, ఆశయాలను, పవన్ కలాణ్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామంలో సిసి రోడ్లు, కాలువలల్లేవని గ్రామస్తులు అన్నారు. మీ సమస్యలు జనసేన అధిష్టానం దృష్టికి తీసుకొస్తే సమస్యలను పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పెట్టి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం జనసేన నాయకులు కూరంగి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం, కార్యకర్తలు బిడ్డిక రమణ, సవర భాస్కరావు, తదితరులు పాల్గొన్నారు.

యువకులతో మాట్లాఉతున్న జనసేన నాయకులు నాగేశ్వరరావు

గిరిజన విద్యార్థులకు వరం ఇంజినీరింగ్ కళాశాల

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం గిరిజన విద్యార్థులకు వరమని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో నిర్మిస్తున్న గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన పిల్లలెవరూ పెద్ద చదువులకు దూరం కాకూడదనే ప్రతి పేద గిరిజన విద్యార్థి ఇంజనీరింగ్ పట్టభద్రుడై ఉన్నత స్థానంలో ఉండాలనే దృఢ సంకల్పంతో ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల నిర్మిస్తామని ఇచ్చి హామీ నిలబెట్టుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నిధులు విడుదల చేసి పనులు కూడా శరవేగంగా జరిగినట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు.

బిటిరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మండలంలో గొటివాడ పంచాయతీలో గల టేకరకండి నుంచి బల్లుకోట వరకు రూ.కోటీ 76 లక్షలతో 3.2 కిలోమీటర్ల మేరకు బిటి రహదారి నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కనీస మౌలిక వసతులైన తాగునీరు, విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలు కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, అయ్యర్కల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయచంద్రశేఖర్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి.బంగారనాయుడు, జి.విద్యా రాణి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైసీపీ నాయకులు షేక్ నూరేల్, ఐ. రామకష్ణ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. భవిష్యత్తు గ్యారంటీ చైతన్య రథయాత్ర కార్యక్రమం సందర్భంగా మంగళగిరిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అణగదొక్కిందన్నారు. విద్యుత్, గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. ప్రజల కష్టాలు పోవాలన్నా, భవిష్యత్తు గ్యారెంటీ కావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

రథయాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో జగన్నాథస్వామి రథయాత్ర ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుండడంతో ఆ ఏర్పాట్లును దేవాదాయశాఖ ఉపకమిషనర్ సుజాత సోమవారం పరిశీలించారు. ఆలయంతో పాటు రథాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని, వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా చివరి మూడు రోజులు రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

దేవాదాయ శాఖ షాపులు బహిరంగ వేలం వేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జిల్లాలో దేవాదాయ శాఖకు చెందిన షాపులను బహిరంగ వేలం వేయాలని జనసేన నాయకులు కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్‌కు వినతిని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని దేవాలయాలకున్న షాపులు అద్దెకిచ్చే విషయంలో అవకతవకలు జరుగు తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొంతమంది తక్కువ ధరలకు చేజిక్కించుకొని, వాటిని వేరే వ్యక్తులకు అధిక ధరలకు అద్దెకు ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా రాయగడ రోడ్డు లో ఉన్న ఫ్రెండ్స్ షూమార్ట్ పరిస్థితి ఇదే అన్నారు. అలాగే జిల్లాలోని దేవాదాయ శాఖకు చెందిన షాపుల అద్దెల విషయంలో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లతోందన్నారు. కావున ఇకపై జిల్లాలోని దేవాదాయ శాఖకు చెందిన ప్రతి షాపు అద్దెకిచ్చే విషయంలో బహిరంగం వేలం వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చందక అనిల్ కుమార్, వంగల దాలినాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, సిరిపురపు గౌరీశంకర్, మానేపల్లి ప్రవీణ్, జనసేనా సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో నిలవాలంటే విద్యార్థి దశే కీలకం

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలంటే విద్యార్థి దశే కీలకమనికోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ అన్నారు. సోమవారం కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్థాయి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు కలిశెట్టి భార్గవి, షర్మిల, కందిశ మానసకు సర్పంచ్, ప్రధాన ఉపాధ్యాయులు చినతిరుపతి రావు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలినాయుడు, రవికుమార్, స్కూల్ చైర్మన్ పద్మనాభం పద్మావతి, అప్పలనాయుడు, శేషగిరిరావు, పద్మావతి,సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలో నాగూరు జిల్లా ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. కోరాడ తరుణ్ శంకర్, వడ్డి జ్యోతిర్మయి, ద్వారపురెడ్డి నవీన్ ప్రథమ, ద్వితీయ, తృతీయన బహుమతులు అందుకున్నారు. వీరికి జెడ్పీ వైస్‌చైర్మన్ ఎం.బాపూజీ నాయుడు అందజేవారు. కార్యక్రమంలో కేతిరెడ్డి అచ్యుతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పడాల రోహిణి, బొండపల్లి మధుసూధనరావు, శిల్లా దినేష్‌కు స్థానిక సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ పురస్కారాలను, నగదు బహుమతిని అందజేశారు.

సీతానగరం : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపిపి రమణమ్మ

ఎస్ఎంసి చైర్మన్ శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్దలు కాపారపు సత్యనారాయణ, గురురాజు, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్య వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన భవాని, పద్మిని, రాజేశ్వరి, మోహన్, కిరణ్‌కు ఎంపిపి బి.రవణమ్మ, శ్రీరాములు నాయుడు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమసూర్యనారాయణ, వైసిపి నాయకులు ఆర్‌వి పార్ధసారథి, హెచ్ఎం ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

విప్లవ ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామీణ పేదల సంఘం అనుబంధ సంస్థ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సాయి వాసవి తిరుమల కల్యాణ మండపంలో గిరిజన సంఘం అధ్యక్షులు ఉర్లక త్రినాథ్ అధ్యక్షతన ప్రాంతీయ సభ సోమవారం జరిగినది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటేశ్వరరావు భూస్వామ్య విధానం రద్దు, దున్నేవానికి భూమి సాధించడం కోసం వ్యవసాయక విప్లవం ద్వారానే ఉద్యమాలు నిర్మించాలని భారత విప్లవోద్యమ నిర్మాతలు డివి, టిఎన్ చూపిన జనతా ప్రజాతంత్ర విప్లవ బాటలో విప్లవోద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. గిరిజనులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న భూ సమస్యను ఈ ప్రభుత్వాలు పరిష్కారం చేయకపోగా పోలీసు యంత్రాంగంతో నిర్బంధాలకు గురిచేస్తున్నారన్నారు. ప్రజలంతా పాల్గొని సంఘటితంగా పోరాడుతూ భారత విప్లవం కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు తిమ్మక వరహాలు, గ్రామీణ పేదల సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరవింద్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరంగి చలమయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణ పేదల సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓ.పి.డి.ఆర్)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎఎస్ నాయుడు, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సవర తోటయ్య, గిరిజన సంఘం కార్యదర్శి కామ్రేడ్ తాడంగి సుబ్బారావు మాట్లాడారు. నవోదయ కళాకారులు బాలకష్ణ, చంద్రమోహన్, పాపారావు, సత్యనారయణ విప్లవ గేయాలు ఆలపించారు. ఈ సభలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష' అమలు

ప్రజాశక్తి-పాలకొండ

జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, డిజిటల్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజల అవసరాలు గుర్తించి వారికి సకాలంలో సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి అందాల్సిన సేవలు ఈ కార్యక్రమం ద్వారా అందించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ డొంక త్రినాధులు, ఉపతహశీల్దార్ బి.బుచ్చియ్య, రీసర్వే డిటి సన్యాసిరావు, ఆర్ఐ పుష్ప తదితరులున్నారు.

ఫైనాపిల్‌ను పరిశీలిస్తున్న భూదేవి

ఫైనాపిల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఫైనాపిల్ పంట సీతంపేట ప్రాంతంగా అధికంగా సాగవుతుందని, కావున దీనికి అనుబంధ పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల గిరిజన రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని సామాజిక వేత్త, టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. సోమవారం ఆమె కుసిమి, దారిమల్లి, కొడిశ తదితర గ్రామాల రైతులను కలిసి ఫైనాపిల్ సాగుపై మాట్లాడారు. అనంతరం భూదేవికి ఫైనాపిల్‌ను కొడిశ సర్పంచ్ సవర భవానీ ఆధ్వర్యంలో రైతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైనాపిల్‌తో వివిధ రకాల ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తున్నాయని గుర్తు చేశారు. వాటికి సంబంధించిన పరిశ్రమలు సీతంపేటలో ఏర్పాటు చేసి గిరిజన రైతులకు, యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

జగన్నాథ రథం తయారీకి నిధులను మంజూరు చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జగన్నాథుని రథం తయారీకి నిధులను మంజూరు చేయాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాతను జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలో గల జగన్నాథ స్వామి ఆలయాన్ని సోమవారం ఆమె ఇఒ మండల ప్రసాద్, దేవాదాయశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు గత నాలుగేళ్లుగా జగన్నాథస్వామి రథం మరమ్మతులకు గురై ధ్వంసం పోయిందని, రెండేళ్ల నుంచి రథం లేకుండానే జగన్నాథ స్వామి రథయాత్రను దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారని తెలిపారు. దీనివల్ల కొన్నేళ్లుగా స్వామివారికి జరుగుతున్న సాంప్రదాయాలు మరుగున పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే దేవాదాయ శాఖ అధికారి రథం తయారీకి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ అధికారిని బదిలీపై వెళ్లిపోయారన్నారు. తక్షణమే రథం తయారీకి నిధులను మంజూరు చేస్తూ, పనులు ప్రారంభించాలని కోరారు. దీనికి డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ రథం తయారీకి పూర్తిస్థాయి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, తాళబత్తుల శ్రీనివాసరావు, శిగడం భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు

సంసద్ ఆదర్శ్ గ్రామంగా ఎంపికపై హర్షం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ సంసద్ ఆదర్శ్ గ్రామంగా ఎంపిక కావడం హర్షణీయమని సర్పంచ్ ఎ.మన్మధరావు అన్నారు. సోమవారం నీలకంఠాపురం సచివాలయం వద్ద ప్రజలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలకు జిల్లాలో ఐదు సంసద్ ఆదర్శ్ గ్రామాల్లో మన పంచాయతీకి చోటు దక్కడం గర్వంగా ఉందన్నారు. పంచాయతీని మరింత అభివృద్ధి చేయడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 21న గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి రెసిడెన్షియల్ ఐటిఐలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తెలిపారు. ఇంటర్, పాలిటెక్నికల్ సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్, వెల్డర్ చదివి ఉన్న విద్యార్థులు ఎల్ఎన్‌టి కంపెనీలో చేరడానికి ఈ జాబ్ మేళాను వినియోగించుకోవాలని ఆయన కోరారు. 18 నుంచి 35 ఏళ్లలోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

వార్డులో పర్యటన

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో 4వ వార్డులో సోమవారం కౌన్సిలర్ గంగునాయుడు పర్యటించారు. 4వ వార్డు పరిధిలో 1,2,3 వీధుల్లో సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్య నిర్వహణ సమస్య అధ్వాన్నంగా ఉందని చెప్పడంతో ఈ సమస్యను సచివాలయం కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

వెలగని విద్యుత్తు దీపాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రాయగడ రోడ్డు మొదలు నుంచి కొత్త వీధి వరకు ప్రధాన రహదారి మధ్యలో ఉన్న వీధి దీపాలు గత నాలుగు రోజులుగా వెలగకపోవడంతో పట్టణంలో అంధకారం అమలుకుంది. సంబంధిత మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు గానీ, విద్యుత్ అధికారుగానీ దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకుపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చినభోగిలిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలిలో పారిశుధ్యం పనులను సర్పంచ్ కురుమాన రాధా శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో చేపట్టారు గ్రామ పురవీధుల్లో మురుగునీరు, చెత్తాచెదారం తొలగించడం, బావులను శుభ్రం చేశారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ముందు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోహర్ గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.గోపీ, సహాయ కార్యదర్శి బి.బంగారి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒకు వినతిఅందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు తాము ఇవ్వలేమని, బయట కొనుక్కోండని ఇంటర్ విద్యాశాఖ అనడం హాస్యాస్పదమన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు ఇతరత్రా పేరుతో ఖర్చుచేస్తున్న ప్రభుత్వం పుస్తకాల విషయంలో పొదుపుగా వ్యవహరించడం ఇంటర్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై మురుగు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డుపై నిల్వ ఉన్న మురికినీటిని తొలగించి ప్రమాదాలబారి నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గుమడ సమీపా అంతరాష్ట్ర రహదారిపై నీరుని తొలగించి, కాలువలు శుభ్రపర్చాలని కోరుతూ బాధిత దళిత కుటుంబాలతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు అంతా చెరువులా మారిందని, వెంటనే నీరుని తొలగించి, గతంలో మాదిరిగా నీరు నిల్వ ఉండకుండా చేయాలని కోరారు.

భాస్కరరావుకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వి.భాస్కరరావుకు సోమవారం సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈయన భామిని మండలం 2వ ఎంఇఒగా ఉద్యోన్నతిపై బదిలీ కావడంతో ఉపాధ్యాయ సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

బస్సుకు బ్రేక్ డౌన్... ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఆర్టీసీ బస్సుకు బ్రేక్ డౌన్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పార్వతీపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బీరుపాడు వెళ్తుండగా దేరువాడ సమీపాన బ్రేక్ పట్టడంతో ఘాటీ ఎక్కలేక ఆగిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర అవస్థలుపడ్డారు. చాలాసేపు తర్వాత కొంతమంది ఆటోలో, మరి కొంతమంది కాలినడకన తమ గ్రామాలకు వెళ్లాల్సి వచ్చింది. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్న ప్రభుత్వం కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని గిరిజనులు కోరుతున్నారు.

93 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస జంక్షన్‌లో శ్రీ సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా కేంద్రంలో సోమవారం శ్రీకాకుళంలోనే రాగోల్ జేమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ఆర్థోపెటిక్, కార్డియాలజీ జనరల్ వైద్యులు దినేష్, స్వప్న 93 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 22 మందిని ఎంపిక చేసి మెరుగైన వైద్యం కోసం జేమ్స్ ఆస్పత్రికి తరలించారు. రోగులకు (అన్నపూర్ణ సేవా కేంద్రం వారు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ కే వేణుమాధవ్, పిఆర్ఒ అన్నపూర్ణ సేవా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని దశమంతపురంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్ వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయోమి, ఎఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కొమరాడ మండలం విక్రాంపురానికి చెందిన సారికి రామునాయుడును లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం సోమవారం కిరాణా సామానులు కొనేందుకు రామునాయుడు పార్వతీపురం- కూనేరు రహదారిని దాటుతుండగా, కూనేరు నుండి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయపడ్డాడు. విషయం తెలుసుకుని ఆతని భార్య మంగమ్మ కుటుంబీకుల సహాయంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థలవివాదంలో మహిళపై దాడి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పికి చెందిన చెల్లూరు సత్యవతి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తుంది. ఈమె ఇంటి పక్కనే ఆమె అక్క జయమ్మ కుటుంబం కాపురముంటున్నారు. అయితే ఈ ఇరు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవపడుతూ ఉన్నారు. ఇదిలా ఉండగా సోమవారం ఇంటి మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో జయమ్మ కుటుంబం కంకరవేయడంతో అడ్డుకున్న సత్యవతిపై అక్క జయమ్మతో పాటు, అతని భర్త దాడిచేసి గాయపరిచారు. గాయపడిన ఆమెను జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.